ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

గురువారం 4 జూలై 2024 | 3



జిల్లాను అభ్యుదయ పథంలో నడిపించా

మీడియా సమావేశంలో కలెక్టర్ హిమాన్షు శుక్లా



అమలాపురం టౌన్, జూలై 3: నూతనంగా ఏర్పడ్డ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో వనరులు తక్కువగా ఉన్నప్పటికీ అంచెలంచెలుగా అభివృద్ధి చేస్తూ రెండేళ్ల కాలంలో అభ్యుదయ పథంలో నడిపించానని కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లో మీడియా మిత్రులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కొత్త జిల్లా ఏర్పడినప్పుడు జిల్లా స్థాయి అధికారులు కూడా లేరని, ఆయా శాఖలకు ఉత్తర, ప్రత్యుత్తరాలు జరుపుతూ జిల్లా అధికారులను సమకూర్చుకున్నామన్నారు. అధికారులను సమన్వయం చేసుకుని వరదలు, తుపాన్ల సహాయక చర్యల్లో సఫలీకృతమయ్యామన్నారు. సార్వత్రిక ఎన్నికలను విజయవంతంగా నిర్వహించామన్నారు. ఎన్నికల సమయంలో శాంతి భద్రతల పరిరక్షణకు ఎస్పీ ఎస్.శ్రీధర్ ఎంతో చురుగ్గా వ్యవహరించారన్నారు. జిల్లాను ప్రగతి పథంలో నడిపించేందుకు అందరూ సమన్వయంతో పనిచేశారని కొనియాడారు. జిల్లా అభివృద్ధిలో మీడియా పాత్ర కీలకంగా ఉందన్నారు. రైతులు ఎదుర్కొంటున్న ఎన్నో ఇబ్బందులను పరిష్కరించామన్నారు. పాజిటివ్ దృక్పథంతో జిల్లా ప్రజానీకానికి మంచి చేసే అవకాశం లభించిందని సంతోషం వ్యక్తం చేశారు. రోజువారీగా రెండు, మూడు గంటలు దినపత్రికలు చదివి తదనుగుణంగా ముందడుగు వేశామన్నారు.



రోడ్డుకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

కొత్తూరు-వెదురుమూడి రోడ్డుకు ఎట్టకేలకు మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆలమూరు, జూలై 3: అధ్వానంగా ఉన్న కొత్తూరు-వెదురుమూడి రోడ్డుకు ఎట్టకేలకు మరమ్మతులు చేపట్టారు. 'ప్రమాదాల రాదారి-పట్టించుకునే వారేరీ!' శీర్షికతో జూన్ 29న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఆర్అండ్‌బీ అధికారులు స్పందించారు. ప్రమాదభరితంగా ఉన్న రోడ్డుకు బుధవారం మరమ్మతులు ప్రారంభించారు. దీంతో ప్రజలు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు.

మహాప్రస్థానం వాహనం ప్రారంభం

అమలాపురం, జూలై 3 (ఆంధ్రజ్యోతి):

మనిషి పుట్టుకతో పాటు అంతిమయాత్ర కూడా గౌరవంగా సాగాలనే ఉద్దేశ్యంతో జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో దాతలు ముందుకు వచ్చి మహాప్రస్థానం వాహనాన్ని అందజేసినట్టు కలెక్టర్ హిమాన్షు శుక్లా, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు తెలిపారు. రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో దాతలు దానం చేసిన వాహనాన్ని బుధవారం వారు జెండా ఊపిప్రారంభించారు. రూ.16లక్షల విలువైన వాహనాన్ని అందించిన దాతలు చెరుకూరి కృష్ణంరాజంరాజు, పిన్నమరాజు కాశీవిశ్వనాథరాజు, సాగి వెంకట్రామరాజులను రెడ్‌క్రాస్ సభ్యులతో కలిసి కలెక్టర్, ఎమ్మెల్యే సత్కరించారు. మహాప్రస్థానం వాహనం అమలాపురం రెడ్‌క్రాస్ కార్యాలయ ఆవరణలో అందుబాటులో ఉంటుందని, జిల్లా పరిధిలో మృతదేహాలను తరలించేందుకు వాహనం అవసరమైన వారు రెడ్‌క్రాస్ కో-ఆర్డినేటర్ 9949294083, 7396999946 నెంబర్లకు ఫోను చేసి సర్వీసును ఉచితంగా పొందవచ్చని రెడ్‌క్రాస్ చైర్మన్ కేఎస్ నారాయణ తెలిపారు. అనంతరం కలెక్టర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, వాహన దాతలు, మాజీ చైర్మన్ డాక్టర్ పీఎస్ శర్మ, కో-ఆర్డినేటర్ రత్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గుండెల్లో పెట్టుకుని పాలిస్తా!

- ప్రజలు ముందు పవన్‌కల్యాణ్ ప్రమాణం
- సమస్యల పరిష్కారానికి కొంత సమయం కావాలి
- రూ.100 కోట్లతో పిఠాపురం టెంపుల్ సర్క్యూట్
- ఏలేరు, సుద్దగడ్డ ఆధునికీకరణకు చర్యలు
- పిఠాపురం సీహెచ్‌సీని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా అభివృద్ధి
- ఉప్పాడ రైల్వేగేటు వద్ద ఫ్లైఓవర్.. ఏడాదిలో నిర్మాణం
- గొల్లప్రోలులో కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటుకు హామీ
- పిఠాపురంలో విత్తనశుద్ధి కేంద్రం ఏర్పాటు చేస్తాం
- ఉప్పాడ సముద్రపు కోతకు పరిష్కారం చూపిస్తాం
- తీరప్రాంతం ఏడాదిన్నరలోగా పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి







పిఠాపురంలోని ఉప్పాడ సెంటర్‌లో వారాహిపై నుంచి మాట్లాడుతున్న పవన్‌కల్యాణ్, హాజరైన జనం.. వాహనంపై ఇతర నేతలు

పిఠాపురం, జూలై 3: భారతదేశం అంతా ఇటువైపు చూసేలా తీర్పు ఇచ్చి అత్యధిక మెజార్టీతో గెలిపించిన పిఠాపురం నియోజకవర్గ ప్రజలను గుండెల్లో పెట్టుకుని పాలిస్తానని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవనకల్యాణ్ అన్నారు. పిఠాపురం ఎమ్మెల్యేగా విజయం సాధించి డిప్యూటీ సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తనను గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేసేందుకుగాను పిఠాపురం పట్టణంలోని ఉప్పాడ సెంటర్‌లో బుధవారం సాయంత్రం వారాహి విజయభేరి సభ నిర్వహించారు. ఈ సభలో ప్రజల సాక్షిగా మీ ముందు ఎమ్మెల్యేగా ప్రమాణం చేస్తున్నానంటూ పవన్‌కల్యాణ్ అనే నేను భారత రాజ్యాంగానికి కట్టుబడి ఉంటానని, తనను అఖండ మెజార్టీతో గెలిపించిన పిఠాపురం నియోజకవర్గ ప్రజలు, పెద్దలు, ప్రముఖులు, యువత, మహిళలు, అన్ని వర్గాల వారికి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీలకు, క్రిస్టియన్, ముస్లిం మైనార్టీలు అందరికీ హామీ ఇస్తున్నాను.. మానవత్వాన్ని కాపాడతానని, మీ అభ్యున్నతికి నిరంతరం కష్టపడతానని, లంచాలు తీసుకోనని ప్రమాణం చేస్తున్నాను. సమస్యల పరిష్కారానికి కొంత సమయం ఇవ్వాలని పవన్ కోరారు. అష్టాదశ శక్తి పీఠాల్లో దశమ శక్తి పీఠాధిపతి అయిన పురుహూతికా అమ్మవారిని కేంద్రంగా చేసుకుని ప్రసాద్ స్కీమ్ కింద రూ.100 కోట్లతో పిఠాపురాన్ని టెంపుల్ సర్క్యూట్‌గా అభివృద్ధి చేస్తానని పవన్ తెలిపారు. ఇదే విషయంపై ప్రధాని మోదీని కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ కోరారని చెప్పారు. ఏలేరు, సుద్దగడ్డ ఆధునికీకరణ చేస్తామని తెలిపారు. ఈ పనులు పూర్తి చేసేందుకు కొంత సమయం పడుతుందన్నారు. పిఠాపురం సీహెచ్‌సీని సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిగా అభివృద్ధి చేస్తామని, ఇక్కడ బహుళ అంత స్తుల భవనం నిర్మిస్తామని, దీనికి సంబంధించిన ప్రక్రియ ఇప్పటికే మొదలైందని వివరించారు. నిత్యం రద్దీగా ఉండే పిఠాపురం-ఉప్పాడ మధ్య రైల్వేగేటు వద్ద ఫ్లైఓవర్ నిర్మాణాన్ని ఏడాదిలోగా పూర్తిచేస్తామని ప్రకటించారు. ప్రధాని మోదీని కలిసి ఇదే కోరతానని తెలిపారు. అధికారులు సమయం పడుతుందని చెప్పినా ఎవరితో మాట్లాడాలో చెప్పండి, ఏడాదిలోగా పూర్తి కావాలని చెప్పానన్నారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలును సెరీకల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతానని.. చిత్తూరు, మదనపల్లి, హనుమాన్ జంక్షన్ వంటి ప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా ఇక్కడే రీలింగ్, ఆప్టిమైజింగ్ సెంటర్ ఏర్పాటుచేస్తామని తెలిపారు. గొల్లప్రోలు మండలంలో ఉద్యానవన పంటలు అధికంగా పండుతాయని, ఇక్కడ కోల్డ్ స్టోరేజీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. దుర్గాడలో మిర్చి కేంద్రాన్ని ఏర్పాటుచేస్తానని తెలిపారు. పిఠాపురం పశువుల సంత అభివృద్ధికి చర్యలు చేపట్టామని.. ఒకట్రెండు రోజుల్లోనే పనులు ప్రారంభమవుతాయని చెప్పారు.

ఉప్పాడ-కాకినాడ తీరప్రాంతాన్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతాం

ఉప్పాడ సముద్ర తీరప్రాంతంలో కోత నివారణకు చర్యలు చేపట్టడంతోపాటు ఉప్పాడ-కాకినాడ మధ్యగల 11-13 కిలోమీటర్ల తీరప్రాంత రహదారిని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసి ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతామని పవన్ తెలిపారు. 18 నెలల కాలంలోనే ఈ పనులు పూర్తి చేసి సాయంత్రం పూట ఆహ్లాదకర వాతావరణంలో ప్రజలు కూర్చుని ప్రకృతిని ఆస్వాదించేలా, యువత ఆడుకునేందుకు వీలుగా అన్ని సౌకర్యాలు కల్పిస్తామని, అదే సమయంలో వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని వివరించారు. ఇందుకు సంబంధించిన మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామని తెలిపారు. వచ్చే సోమ, మంగళవారాల్లో ఆ డాక్యుమెంట్‌ను రిలీజ్ చేస్తామని చెప్పారు. నేను ఇక్కడకు రాకపోయినా ఎప్పటికప్పుడు నేను నియోజకవర్గానికి ఏ పనిచేశానో చెబుతానని తెలిపారు. కాకినాడ సెజ్‌లో 8 వేల ఎకరాల భూమి ఉందని, ఇక్కడ భూములు కోల్పోయిన రైతుల సమస్యల పరిష్కారం దిశగా చర్యలు చేపడతామని చెప్పారు. ఇక్కడ పరిశ్రమలు తీసుకువచ్చి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు.



ఉప్పాడలో సముద్ర తీరం కోతను మ్యాప్ ద్వారా పరిశీలిస్తున్న పవన్‌కల్యాణ్

మీ నమ్మకాన్ని వమ్ము చేయను

నాపై నమ్మకం ఉంచి అత్యధిక మెజార్టీతో గెలిపించిన మీ నమ్మకాన్ని వమ్ము చేయనని పవన్‌కల్యాణ్ అన్నారు. రోడ్లు అన్నింటిని అభివృద్ధి చేస్తానని, తొలుత గుంతలు పూడ్చే పనులు చేపడతామని తెలిపారు. మీరు ఇచ్చిన శక్తి నన్ను ఉప ముఖ్యమంత్రిని చేసిందని చెప్పారు. నన్ను గుండెల్లో పెట్టుకున్న స్థానాన్ని చివరి శ్వాసవరకూ, జగద్దేవిలో ఐక్యం అయ్యే వరకూ కాపాడుకుంటానని తెలిపారు. దత్తాత్రేయ పరంపరను ఆచరించిన వాడిని, శ్రీపాదశ్రీవల్లభ చరిత్ర చదివిన వాడిని కాని స్వామి దర్శనం మాత్రం త్వరగా అవ్వలేదని చెప్పారు. 2014, 2019 సంవత్సరాల్లో ఇక్కడకు వచ్చినా శ్రీపాదశ్రీవల్లభుడిని దర్శించుకోలేకపోయాయని, ఇక్కడ ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నానని ప్రకటించిన తర్వాత ఆ స్వామి దర్శన భాగ్యం కల్పించారని తెలిపారు. 2028 నాటికే పిఠాపురాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా తీర్చిదిద్ది ఎవ్వరైనా పోటీకి రావాలంటే ఆలోచించేలా చేస్తానని చెప్పారు. పిఠాపురం అభివృద్ధి దేశానికి మోడల్‌గా మారుతుందని తెలిపారు. మీరు గర్వించేలా కష్టపడి పనిచేసి ఈ నేల రుణం తీర్చుకుంటానని చెప్పారు.

నేను ఇక పిఠాపురం వాస్తవ్యుడినే...

తాను ఈరోజు నుంచి పూర్తిగా పిఠాపురం వాస్తవ్యుడినేనని పవన్ కల్యాణ్ అన్నారు. ఈ మాట మీ అందరి ముందు గౌరవంగా చెబుతున్నానని తెలిపారు. మూడు ఎకరాల స్థలం తీసుకున్నానని, కొనుగోలు పత్రాలపై ఈరోజే సంతకం చేశానని చెప్పారు. ఇక్కడే ఇల్లు, పార్టీ కార్యాలయాన్ని నిర్మిస్తామని తెలిపారు. ఒకటి నుంచి రెండు ఎకరాల స్థలం పార్టీ కార్యాలయం నిర్మాణం చేపడతామని, పార్టీ నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు, వీరమహిళలు అందరి వచ్చి కూర్చొనేలా ఏర్పాట్లుచేస్తామని చెప్పారు. తనకు వినతులు ఇచ్చేందుకు వస్తున్న వారి నుంచి పిటిషన్లు తీసుకునేందుకు ఐదుగురు సిబ్బందిని నియమించినట్టు తెలిపారు. ఇందులో వైద్యపరమైన వాటికి అధిక ప్రాధాన్యమివ్వాలని, శాంతి భద్రతలు, కిడ్నాప్ అదృశ్యం కేసులు, యువత ఉపాధి అవకాశాలకు తదితర అంశాలకు ప్రాధాన్యమిస్తున్నట్లు చెప్పారు. త్వరలోనే జాబ్‌మేళా నిర్వహిస్తామని, యువతకు అవసరమైన నైపుణ్య శిక్షణ ఇస్తామని తెలిపారు.

వర్మ చెప్పిన మాట నిజమయ్యింది

అసెంబ్లీ గేటు కూడా తాకనివ్వమని, అసెంబ్లీలోకి అడుగు పెట్టలేవని వైసీపీ నేతలు అన్నారు. అప్పుడు వర్మ ఒక మాటన్నారు. అసెంబ్లీ గేట్లు తోసుకుంటూకాదు బద్దలుకొట్టుకుంటూ పవన్ వస్తాడని, ఆ మాటే నిజమైందని, ప్రజలు సీరియస్‌గా తీసుకుని తనను డిప్యూటీ సీఎం సీటులో కూర్చొబెట్టారని పవన్‌కల్యాణ్ తెలిపారు. ఈ విజయాన్ని పిఠాపురం నియోజకవర్గ ప్రజలకే అంకితం చేస్తున్నానని చెప్పారు. సభలో ఎంపీ తంగెళ్ల ఉదయశ్రీనివాస్, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ, జనసేన, బీజేపీ ఇన్‌చార్జిలు మర్రెడ్డి శ్రీనివాసరావు, డాక్టర్ బుర్రా కృష్ణంరాజు, జనసేన కాకినాడ జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు పాల్గొన్నారు.

ముగిసిన మూడు రోజుల పర్యటన

డిప్యూటీ సీఎంగా బాధ్యతలు స్వీకరించిన పవన్‌కల్యాణ్ కాకినాడ జిల్లాలో మూడు రోజులు జరిపిన పర్యటన బుధవారం రాత్రి పర్యటన ముగిసింది. 1న పిఠాపురం నియోజకవర్గానికి వచ్చిన ఆయన గొల్లప్రోలు పట్టణంలో జరిగిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం, సాయంత్రం జనసైనికులు, వీరమహిళల సమావేశంలో పాల్గొని తన గెలుపునకు కృషి చేసిన వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. 2న కాకినాడ కలెక్టరు కార్యాలయంలో జరిగిన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి గ్రామీణ నీటి సరఫరా, అటవీ పర్యావరణశాఖల సమీక్షలు చేశారు. బుధవారం ఉప్పాడలో సముద్రపుకోత ప్రాంతాన్ని అధికారులు, నిపుణులతో కలిసి పరిశీలించారు. అనంతరం పిఠాపురం ఉప్పాడ సెంటర్‌లో వారాహి విజయభేరి సభలో పాల్గొన్నారు.

పునరుజ్జీవం

- కోటి రూపాయల విధ్వంసం
- రెస్టారెంట్ భవనాన్ని కూల్చిన దుండగులు
- జీవం కోల్పోయిన కళా వేదిక
- చెత్త కుప్పలకు నిలయంగా ఎస్.యానాం బీచ్
- పాలకులు మారడంతో ప్రాజెక్టుపై చిగురిస్తున్న ఆశలు
- పునరుద్ధరణకు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ప్రయత్నాలు



ఎస్.యానాం బీచ్‌లో ధ్వంసమైన రెస్టారెంట్ భవనం



బీచ్‌లో ప్రస్తుత పరిస్థితిని ఆర్డీవోకు చూపిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

ఉప్పలగుప్తం, జూలై 3: కోనసీమ జిల్లాలోని ఎస్.యానాం సముద్ర తీరానికి ఒక ప్రత్యేకత ఉంది. ఇక్కడి నుంచి కాట్రేనికోన మండలం చిర్ర యానం వరకు విశాలంగా విస్తరించి ఉన్న తీరంలో ఉన్న ఇసుక తెల్లగా ఉంటుంది, దీంతో వైట్ శాండ్ బీచ్ అని పిలుస్తుంటారు. గతంలో టీడీపీ హయాంలో అమలాపురం ఎమ్మెల్యేగా ఎన్నికైన ఎస్.యానాంకు చెందిన అయితాబత్తుల ఆనందరావు బీచ్ ఏర్పాటుకు ఆలోచన చేశారు. అప్పటికే ఎస్.యానాం సముద్ర తీరంలో సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉండేది. సముద్ర తీరాన్ని పర్యాటక కేంద్రంగా రూపొందిస్తే గ్రామాభివృద్ధితో పాటు పర్యాటకుల వల్ల ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుందని ఆయన వ్యూహరచన చేశారు. ఇందులో భాగంగా అప్పటి హోం మంత్రి నిమ్మకాయల చినరాజప్పతో చర్చించి స్వదేశీదర్శన్ నిధుల సాధనకు కృషి చేశారు. రాష్ట్ర పర్యాటక విభాగం ముఖ్య కార్యదర్శి ఈ ప్రాంతాన్ని పరిశీలించి చిర్ర యానాం నుంచి అల్లవరం మండలం ఓడలరేవు వరకు తీరం వెంబడి రూ.10కోట్లతో పర్యాటక ప్రాజెక్టు అమలు చేసేందుకు నివేదిక సిద్ధం చేశారు. ఇందులో భాగంగా తొలుత కోటి రూపాయలతో ఎస్.యానాం బీచ్‌లో రెస్టారెంటు, కళా వేదిక, హట్స్ నిర్మాణాలు పూర్తయ్యాయి. ఎస్.యానాం నుంచి బీచ్ వరకు మూడు కిలోమీటర్ల రహదారి నిర్మాణ పనులు వేగవంతమయ్యాయి. ఎస్.యానాం బీచ్‌కు జిల్లా నలుమూలల నుంచి సందర్శకులు అధిక సంఖ్యలో రావడం ప్రారంభించారు. గ్రామంలో వ్యాపారులకు ఆదాయం పెరిగింది. కోనసీమ ఉత్సవాలను సైతం ఇక్కడ ఘనంగా నిర్వహించారు. ఈ సమయంలో ప్రభుత్వం మారడంతో అందరి ఆనందం ఆవిరయ్యింది. నిర్మాణంలో ఉన్న రోడ్డు పనులు నిలిచిపోయాయి. టీడీపీ ప్రారంభించిన ప్రాజెక్టు అన్న భావనతో పాలకులు ఎస్.యానాం పర్యాటకానికి ఫుల్‌స్టాప్ పెట్టారు. బీచ్‌లోని కట్టడాలను ధ్వంసం చేశారు. ఐదేళ్లు గడిచిపోయాయి. ప్రాజెక్టు ఆలోచనకర్త తిరిగి ఎమ్మెల్యే కావడంతో టూరిజం ప్రాజెక్టు తెరపైకి వచ్చింది. ఎస్.యానాంను పర్యాటక కేంద్రంగా చేసి, సంపద సృష్టికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే ఆనందరావు ప్రజలకు హామీ ఇచ్చారు. మిగిలిన బీచ్ రోడ్డు నిర్మాణానికి వెంటనే భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. బుధవారం ఆయన అమలాపురం ఆర్డీవో కేశవర్ధనరెడ్డిని వెంటబెట్టుకుని బీచ్ ప్రాంతంలో పర్యటించారు. పరిస్థితిని వివరించి ప్రాజెక్టు పనుల పునరుద్ధరణకు నివేదిక రూపొందించాలని ఆర్డీవోను కోరారు.



తీరం వెంబడి నిర్మించిన హట్స్



బీచ్‌లో నిర్మించిన కళా వేదిక

సంక్షేమంతో పాటు సంపద సృష్టి జరగాలి

అయితాబత్తుల ఆనందరావు, ఎమ్మెల్యే

కుటుంబం లేదా ప్రభుత్వం తమ వారికి సంక్షేమం అమలు చెయ్యాలంటే ఆదాయం ఉండాలి. ఆదాయం ఉండాలంటే సంపద సృష్టి జరగాలి. దీనిని టీడీపీ అధినేత చంద్రబాబు పాలనలో చేసి చూపించారు. ఆ సూత్రం ఆధారంగా ఎస్.యానాం బీచ్‌ను పర్యాటక కేంద్రంగా చేస్తే ఆదాయ వనరులు సమకూరుతాయని ప్రాజెక్టుకు రూపకల్పన చేశాం. ప్రాజెక్టు పూర్తయితే ఎందరో వ్యాపారులు, వాహనదారులు ఉపాధి పొందుతారు. ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది. సంక్షేమం పేరుతో అప్పులతో ఐదేళ్లు నెట్టుకొచ్చిన వైసీపీ ప్రభుత్వం ఎస్.యానాం టూరిజం ప్రాజెక్టును శిథిలావస్థకు చేర్చింది. ముఖ్యమంత్రి చంద్రబాబుకు పరిస్థితిని వివరించి ప్రాజెక్టు పునరుద్ధరణకు నిధుల సాధనకు నా వంతు ప్రయత్నిస్తాను. త్వరలోనే ఎస్.యానాంను పర్యాటక కేంద్రంగా రూపొందించేందుకు అందరి సహకారం తీసుకుంటాను.



నిర్మాణాల ప్రారంభ శిలాఫలకం



మూలవిరాట్ సంరక్షణ పనులను పరిశీలిస్తున్న పురావస్తు శాఖ అధికారులు

భీమేశ్వరాలయంలో అభివృద్ధి పనుల పరిశీలన

ద్రాక్షారామ, జూలై 3: ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో కేంద్ర పురావస్తు శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పురావస్తు శాఖ దక్షిణ భారత ప్రాంతీయ డైరెక్టరు నవరత్నకుమార్ పాఠక్ బుధవారం పరిశీలించారు. మాణిక్యాంబ అమ్మవారు, స్వామివారి గర్భాలయాల్లో పనులను చూశారు. అమ్మవారి ఆలయంలో శ్రీయంత్రం చుట్టూ ఉన్న సిమెంటు దిమ్మను తొలగించాలని ఆదేశించారు. స్వామి మూలవిరాట్ సంరక్షణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. స్వామివారికి ప్రాతః కాలార్చన అభిషేకంలో తక్కువ పరిమాణంలో జలం ఉపయోగించాలన్నారు. ఈ విషయమై భక్తులకు అవగాహన కల్పించాలన్నారు. ఉజ్జయిని మహాకాళేశ్వర ఆలయంలో అనుసరిస్తున్న పద్ధతులను తెలుసుకోవాలన్నారు. పురావస్తు సంపదను భావి తరాలకు అందజేసే బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో పురావస్తు శాఖ పర్యవేక్షకుడు గోపీనాథ్ జీనా, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ దేబేంద్రనాథ్‌బోయ్, ఎస్ఈ ఏబీపీ వర్మ, సీఏ కేవీఎస్ఎన్ మూర్తి, హార్టికల్చర్ సూపరింటెండెంట్ మహోత్ పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకాలను భ్రష్టు పట్టించారు

జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు



నీరు విడుదల చేస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

సీతానగరం, జూలై 3: రాష్ట్రంలోని ఎత్తిపోతల పథకాలను, పోలవరం ప్రాజెక్టును గత ప్రభుత్వం భ్రష్టు పట్టించిందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ధ్వజమెత్తారు. బుధవారం తూర్పుగోదావరి జిల్లా పురుషోత్తపట్నం గ్రామంలోని పుష్కర-1, పుష్కర-2 ఎత్తిపోతల పథకాలతోపాటు పురుషోత్తపట్నం పంపింగ్ స్కీమ్‌కు మంత్రి స్విచ్ఆన్ చేసి సాగునీరు విడుదల చేశారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి ప్రశాంతితో కలసి పాల్గొన్న మంత్రి ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేయడమే కాకుండా ఎత్తిపోతల పథకాలను భ్రష్టు పట్టించిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక యుద్ధప్రాతిపదికన పంపులు సిద్ధంచేసి 15 రోజుల ముందుగానే రైతులకు నీరందించినట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం రైతుల ఉన్నతికి నిరంతరం కృషి చేస్తుందన్నారు. 3 వేల క్యూసెక్కుల సామర్థ్యం గల పురుషోత్తపట్నం పంపింగ్‌స్కీం ద్వారా 60 వేల ఎకరాలకు, పుష్కర1, పుష్కర2 ఎత్తిపోతల పథకాల నుంచి 1.40 లక్షల ఎకరాలకు 1400 క్యూసెక్కుల సాగునీటిని కాలువల ద్వారా విడుదల చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిట్టూరి రంగారావు, గద్దే వెంకట కృష్ణచౌదరి, పోలిన కృష్ణ, వలవల రాజా, వలవల నానాజీ, కాండ్రు శ్రీనివాసరావు లక్కిశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం

తాడిపూడి ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు విడుదల

తాళ్లపూడి, జూలై 3 : రైతు సంక్షేమమే లక్ష్యంగా, అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామా నాయుడు అన్నారు. తాళ్లపూడి మండలం తాడిపూడి ఎత్తిపోతల పథకం నుంచి ఆయకట్టుకు మంత్రితో పాటు స్థానిక ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ఉంగుటూరు ఎమ్మెల్యే పి.ధర్మరాజు సాగునీటిని విడుదల చేశారు. తొలుత పూజలు చేసి, అనంతరం గోదావరి నదికి హారతులిచ్చి మోటారు స్విచ్ ఆన్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ తాడిపూడి ఎత్తిపోతల పథకం ద్వారా 14 మండలాల్లో 135 గ్రామాల రైతాంగానికి కాలువల ద్వారా 2 లక్షల 6 వేల ఎకరాలకు సాగునీరు సరఫరా చేయనున్నట్లు చెప్పారు. పంపింగ్ స్కీం నుంచి లక్షా 38 వేల ఎకరాలకు కాలువల ద్వారా సరఫరా చేయనున్నట్లు చెప్పారు. మెట్ట ప్రాంతాల్లో ఉన్న 65 వేల ఎకరాలకు సబ్ లిఫ్టల ద్వారా సాగునీటిని అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అశుతోష్ శ్రీవాస్తవ, ఇరిగేషన్ ఏపీ స్టేట్ అడ్వైజర్ ఎం.వెంకటేశ్వరరావు, చీఫ్ ఇంజనీర్ నరసింహమూర్తి, ఈఈలు దేవప్రకాష్, ఏసుబాబు, డీఈ రామేశంనాయుడు, ఏఈలు విజయ్‌కుమార్, శ్రీనివాస్, నాయకులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంఠమణి రామకృష్ణ, అల్లూరి విక్రమాదిత్య, నామన పరమేశ్వరరావు, ముళ్లపూడి శ్రీరామ చంద్రమూర్తి, గన్నిన సత్తిబాబు, కొఠారు వెంకట్రావు, గంటా కృష్ణ, యువగళం సభ్యులు సత్యేంద్ర, భరత్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ట్రావెల్ బస్సు సీజ్

రూ.2.88 లక్షల జరిమానా



పోలీసులు సీజ్ చేసిన బస్సు

శంఖవరం/కార్పొరేషన్(కాకినాడ),జూలై 3: పిఠాపురం నుంచి హైదరాబాద్ ప్రయాణిస్తున్న ఒక ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఎటువంటి అనుమతులు లేకుండా ప్రయాణికులను తరలిస్తుండడంతో కత్తిపూడి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాస్ వాహనాన్ని తనిఖీ చేశారు. బస్సుకు రోడ్ ట్యాక్స్, పర్మిట్ వంటి అనుమతులు ఏమీ లేకుండానే ప్రయాణిస్తున్న విషయాన్ని గుర్తించి రూ.2,88,500 లక్షలు ఫైన్ వేశారు. బస్సును సీజ్ చేసి కాకినాడ ఆర్టీసీ డిపోకి తరలించామన్నారు. దూర ప్రయాణం చేస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులకు అనుమతులు లేకుంటే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

బైక్‌ను ఢీకొన్న లారీ: వ్యక్తి మృతి

దివాన్‌చెరువు, జూలై3 : జాతీయ రహదారిపై బొమ్మూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని దివాన్‌చెరువు సెంటర్‌లో బుధవారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో గోకవరం మండలం తిరుమలాయపాలానికి చెందిన పినమరెడ్డి కొండలరావు(44) అక్కడికక్కడే మృతి చెందాడు. బొమ్మూరు ఎస్.ఐ.శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ప్రకారం.. తిరుమలాయపాలానికి చెందిన కొండలరావు బుధవారం తెల్లవారు జామున 3.30 గంటల సమయంలో తన బైక్‌పై పాలచర్ల వైపు నుంచి శ్రీరాంపురం వైపు వెళ్లేందుకు దివాన్‌చెరువు సెంటర్‌లో రోడ్ క్రాస్ చేస్తున్న సమయంలో విశాఖపట్నం వైపు నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న లారీ వేగంగా వచ్చి ఢీకొంది. ఈప్రమాదంలో కొండలరావు బైక్‌తో సహా లారీ కింద పడి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడని ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. కొండలరావు ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తాడని తెలిసింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమండ్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

పంచాయతీలో అవకతవకలపై విచారణ

సీతానగరం, జూలై 3: రఘుదేవపురం పంచాయతీలో జరిగిన అవకతవకలపై బుధవారం పంచాయతీ కార్యాలయంలో డీఎల్‌పీవో నాగలత విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2023 సంవత్సరంలో ఈవోపీఆర్డీ రికార్డులు తనిఖీ లోపాలు ఉన్నాయని నివేదిక ఇవ్వడంతో ఆ నివేదికపై సంబంధిత వ్యక్తులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినప్పటికి వారి నుంచి నేటి వరకు ఏ విధమైన సమాధానం రాలేదన్నారు. దీంతో బుధవారం విచారణ చేసి సంబంధిత వ్యక్తుల స్టేట్‌మెంట్‌లు తీసుకున్నట్లు చెప్పారు. అవకతవకలకు సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకుని ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మూర్తి, కార్యదర్శి బి. అప్పారావు తదితరులు పాల్గొన్నారు

రాజమహేంద్రవరాన్ని టూరిజం హబ్‌గా మార్చేందుకు కృషి

రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్



ఎస్వీ రంగారావు విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి దుర్గేష్

రాజమహేంద్రవరం కల్చరల్ జూలై 3: రాజమహేంద్రవరాన్ని టూరిజం హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేయనున్నట్లు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. సహజ నటుడు ఎస్వీ రంగారావు 106వ జయంతి సందర్భంగా ఎస్వీఆర్ కల్చరల్ అసోసియేషన్, పంతం సత్యనారాయణ చారిటబుల్ ట్రస్ట్, నగర చిరంజీవి యువత ఆధ్వర్యంలో జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. పంతం సత్యనారాయణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పంతం కొండలరావు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మంత్రి కందుల దుర్గేష్ హాజరై గోదావరి గట్టున ఉన్న రంగారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ ఎస్వీ రంగారావు వంటి మహనీయులు సినీ రంగానికి చేసిన సేవలు, సేవా కార్యక్రమాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకంగా ఉండాలని అన్నారు. సినీ స్టూడియోలు కేవలం తెలంగాణకే పరిమితమయ్యాయని, సినిమా చిత్రీకరణకు అన్ని విధాలా అనువైన నగరంగా ఉన్న రాజమహేంద్రవరం పరిసర ప్రాంతంలో ఒక సినిమా స్టూడియోను ప్రభుత్వ సహకారంతో నిర్మాణం చేపట్టేందుకు తాను తప్పక కృషి చేస్తానని అన్నారు. టీడీపీ నేత ఆదిరెడ్డి అప్పారావు, టీడీపీ నాయకులు యర్రా వేణు గోపాలరావు, రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, మాజీ రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, ఆకుల వీర్రాజు, చల్లా శంకరరావు, కార్యక్రమం నిర్వాహకుడు కొత్తపేట రాజా, నందెపు శ్రీనివాస్, అడపా శ్రీహరి, బాక్స్ ప్రసాద్ పాల్గొన్నారు.

వేద పాఠశాల విద్యార్థులకు డయేరియా?

రత్నగిరిపై కలకలం

వాంతులు, విరేచనాలతో ఆరుగురికి అస్వస్థత

చికిత్స అందిస్తున్న వైద్యులు



చికిత్స పొందుతున్న వేద విద్యార్థులు

అన్నవరం, జూలై 3: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం దేవస్థానం ఆధ్వర్యంలో సత్యగిరిపై నిర్వహిస్తున్న సత్యదేవా స్మార్త, ఆగమ పాఠశాలలో కలకలం రేగింది. వేదవిద్యను అభ్యసిస్తున్న విద్యార్థులలో కొందరికి వాంతులు, విరేచనాలు కావడంతో మిగిలిన విద్యార్థులు అధికారులకు సమాచారమివ్వడంతో హుటాహుటిన వేదపాఠశాలకు చేరుకుని వైద్యచికిత్సలు అందిస్తున్నారు. వివరాల్లోకి వెళితే సత్యగిరి కొండపై రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి 32 మంది బ్రాహ్మణ విద్యార్థులు ఆగమ, స్మార్తవిద్యను అభ్యసిస్తున్నారు. వీరికి వసతి, ఆహారం దేవస్థానమే ఏర్పాటు చేస్తుంది. అయితే బుధవారం విద్యనభ్యసిస్తున్న వారిలో ముందుగా 15 మంది అస్వస్థతకు గురికాగా 9మందికి ప్రాథమిక చికిత్స ద్వారా కోలుకోగా మరో ఆరుగురు తీవ్ర అస్వస్థతకు గురవడంతో ఆందోళన కలిగింది. విషయం తెలుసుకున్న ఈవో రామచంద్రమోహన్ వైద్యసిబ్బందిని హుటాహుటిన వెళ్లాలని ఆదేశించడంతో దేవస్థానం ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్ తన సిబ్బందితో చికిత్స అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరుగురికి డయేరియా లక్షణాలుగా గుర్తించామన్నారు. డీఎంహెచ్ఓ ఆదేశాలతో రావికంపాడు పీహెచ్‌సి సిబ్బంది పర్యవేక్షిస్తుండగా డిప్యూటీ డీఎంహెచ్ఓ సంఘటన స్థలానికి చేరుకుని నీరు, ఆహార పదార్థాల శాంపిల్స్ ల్యాబ్‌కు తీసుకెళ్లారు. విద్యార్థులందరినీ ఆగమ పాఠశాల నుంచి శివసదన్ కాటేజీకి తరలించి అక్కడ వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు. డిప్యూటీ కమిషనర్ రమేష్‌బాబు ఇతర అధికారులు దగ్గరుండి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేపట్టారు. విద్యార్థులంతా కోలుకుని పరిస్థితి సద్దుమణిగిందని డాక్టర్ శ్రీకాంత్ పేర్కొన్నారు. ఇటీవల ఆర్ఓ ప్లాంట్ పాడవడంతో విద్యార్థులు దేవస్థానం వాటర్‌ట్యాంక్ ద్వారా వచ్చే నీటినే తాగుతున్నారని. వంటశాల వద్ద పరిసరాలలో ఈగల మోత అధికంగా ఉంటుందని వంటశాల సిబ్బంది చెబుతున్నారు. బుధవారం సాయంత్రం జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి నాయక్ విద్యార్థులను పరామర్శించి వైద్య సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. గురువారం ప్రత్యేకించి దీనిపై ఓ కమిటీ ఏర్పాటు చేసి కారణాలను విశ్లేషించనున్నట్లు చెప్పారు.

రాజధాని అమరావతి నిర్మాణానికి పింఛన్ విరాళం



పింఛన్ సొమ్ము అందిస్తున్న వెంకటేశ్వరరావు

పి.గన్నవరం, జూలై 3: రాజధాని అమరావతి నిర్మాణానికి ఓ దివ్యాంగుడు పింఛన్ సొమ్ము అందించి ఆదర్శంగా నిలిచాడు. మండలంలోని బెల్లంపూడి శివారు తాడాల వారిపాలేనికి చెందిన దివ్యాంగుడు యర్రంశెట్టి వెంకటేశ్వరరావు స్థానిక జనసేన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణకు బుధవారం జూలై నెల పింఛన్ రూ.6 వేలు అందించారు. కార్యక్రమంలో నాయకులు శిరిగినీడి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి కుమార్, చుట్టుగుళ్ల కిశోర్, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, పోలిశెట్టి రాజేష్, ఆదిమూలం వెంకటేశ్వరరావు, తాటికాయల శ్రీనివాసరావు, కోట రాజేంద్రప్రసాద్, షేక్ దొరబాబు, కర్రి బాబూరావు, తాటికాయల బాబ్జి, యర్రంశెట్టి వీరాస్వామి పాల్గొన్నారు.

బ్యాంకు బిజినెస్ కరస్పాండెంట్‌పై కేసు నమోదు

దివాన్‌చెరువు, జూలై 3: రాజానగరం మండలం జి.ఎర్రంపాలెంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచికి చెందిన బిజినెస్ కరస్పాండెంట్ నానిబాబుపై బ్యాంక్ ఆఫ్ బరోడా అధికారులు పోలీస్‌లకు ఫిర్యాదు చేయడంతో ఎఫ్ఐఆర్ నమోదు అయినట్లు జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ డీవీ ప్రసాద్ బుధవారం విలేకరులకు తెలిపారు. ఆంధ్రజ్యోతిలో బ్యాంక్ ఆఫ్ బరోడా బీసీ పాయింట్‌లో రూ.40 లక్షల గోల్‌మాల్? అనే శీర్షికన బుధవారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే.. స్వయం సహాయక సంఘం మహిళా సభ్యురాలు ఫిర్యాదు మేరకు గత నెల 20వ తేదీన విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చారు. సంబంధిత బీసీని నియమించిన నోడల్ ఏజెన్సీ ఈ విషయంలో పూర్తిబాధ్యత వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఇదే అంశంపై డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్.వి.వి.ఎస్.మూర్తి వివరాలు తెలియజేస్తూ జి.ఎర్రంపాలెం బ్యాంక్ ఆఫ్ బరోడా సంబంధించిన బీసీ బ్యాంకు లావాదేవీలను పూర్తిస్థాయిలో పరిశీలించేందుకు విచారణాధికారిగా డీఆర్‌డీఏ అధికారి జనార్థనరావును నియమించామని తెలిపారు.

రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం

ఎటపాక, జూలై 3: పార్లమెంట్ సమావేశాల్లో రాహుల్ గాంధీ హిందువుల పట్ల అనుచితంగా మాట్లాడారని ఆరోపిస్తూ ఎటపాక ప్రధాన రహదారిపై బుధవారం భారతీయ జనతా యువ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మూడే సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సతీష్‌కుమార్ మాట్లాడారు. రాహుల్ గాంధీ హిందువులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. హిందువుల మనోభావాలు దెబ్బతిన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ యువమోర్చా జిల్లా అధ్యక్షుడు చింత దుర్గారావు, బీజేపీ నాయకులు కల్లూరి కృష్ణ, మడకం వెంకటేష్ పాల్గొన్నారు.

6 నుంచి లోవలో ఆషాడ మాసోత్సవాలు

తుని రూరల్, జూలై 3: ఈ నెల 6 నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు లోవ దేవస్థానంలో ఆషాడ మాసోత్సవాలు ప్రారంభం కానున్నాయి. తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు లోవకు తరలివచ్చే అవకాశం ఉండటంతో అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేశారు. భక్తుల నుంచి వచ్చిన వరుస ఫిర్యాదుల నేపథ్యంలో లోవ దేవస్థానంలో వివిధ పనుల్లో పాల్గొనే ప్రైవేట్ వ్యక్తులతో ఆలయ అధికారులు, రూరల్ పోలీసులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రైవేట్ కాటేజ్ యజమానులు, వర్కర్లకు ట్రాఫిక్ నిబంధనలపై పలు సూచనలు ఇచ్చారు. భక్తుల మనోభావాలకు అనుగుణంగా ప్రతిఒక్కరూ నడుచుకోవాలని ఆలయ ప్రాంగణంలో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్గొన చర్యలు ఉంటాయని ఎస్ఐ రమేష్ బాబు సమావేశంలో తెలిపారు

లోవలో ఆషాడ మాస ప్రత్యేక పూజలు

జూలై 7 ఆదివారం అమ్మవారికి వివిధ రంగుల మట్టిగాజులతో ప్రత్యేక అలంకరణ, జూలై14 ఆదివారం అమ్మవారికి లక్ష కుంకుమార్చన, 15న అమ్మవారి జన్మనక్షత్రం స్వాతి సందర్భంగా పంచామృత అభిషేకం, 17న బుధవారం తొలి ఏకాదశి సందర్భంగా గణపతి అభిముఖం, గరిక పూజ, గణపతి హోమం, అమ్మవారికి లక్ష పత్రి పూజ, 21 ఆదివారం అమ్మవారిని శాకంబరి దేవిగా అలంకరణ. అదే రోజు పౌర్ణమి సందర్భంగా చండీ హోమం, 28 ఆదివారం అమ్మవారికి లక్ష పుష్పార్చన, 31 ఏకాదశి సందర్భంగా అమ్మవారికి లక్ష బిల్వార్చన, వచ్చే నెల 3న సప్తనది జలాలతో అమ్మవారికి సహస్ర ఘటాభిషేకం, వచ్చే నెల 4న ఆదివారం 9గంటలకు అమ్మవారికి సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించనున్నట్లు ఆలయ పండితులు, ఈవో విశ్వనాథరాజు తెలిపారు.


భూమి కొన్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

హైవేకు చేర్చి 3.52 ఎకరాలు కొనుగోలు



పిఠాపురం, జూలై 3: ఎన్నికల ముందు తాను పిఠాపురంలో స్థిర నివాసం ఏర్పరచుకుంటానని, ఇల్లు కట్టుకుంటానని చెప్పిన జనసేన అధినేత, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆ దిశగా బుధవారం ముందడుగు వేశారు. పిఠాపురం-గొల్లప్రోలు మార్గంలో 216 జాతీయ రహదారికి చేర్చి భూములను కొనుగోలు చేశారు. కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణ శివారులోని ఇల్లింద్రాడ వై.జంక్షన్ దాటిన తర్వాత గొల్లప్రోలు టోల్‌గేటుకు వెళ్లే మార్గంలో ఉన్న ఒక రెస్టారెంట్ దగ్గర 3.52 ఎకరాలను పవన్‌కల్యాణ్ కొనుగోలు చేశారు. ఇల్లింద్రాడ రెవెన్యూ పరిధిలోకి వచ్చే 2.08 ఎకరాలు, భోగాపురం రెవెన్యూలోకి వచ్చే 1.44 ఎకరాలను కాకినాడకు చెందిన కోన శ్రీనందు వద్ద నుంచి కొనుగోలు చేశారు. ఇందుకు సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియను పిఠాపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో బుధవారం పూర్తి చేశారు. పవన్‌కల్యాణ్ తరఫున ప్రతినిధిగా కాకినాడ నగర జనసేన అధ్యక్షుడు డాక్టర్ తోట మెహర్ సీతారామ సుధీర్ పాల్గొన్నారు. ఎకరం కోటి రూపాయలకు పైగా వెచ్చించి కొనుగోలు చేసినట్లు సమాచారం. భూమి కొన్న విషయాన్ని పిఠాపురం వారాహి బహిరంగసభలో ప్రకటించిన పవన్‌కల్యాణ్ ఇక్కడే ఇల్లు, పార్టీ కార్యాలయాన్ని నిర్మించుకుంటానని, ఇకనుంచి తాను పిఠాపురం వాస్తవ్యుడినేనని చెప్పారు.

నిర్వాసితుల సంక్షేమానికి ప్రాధాన్యమివ్వాలి



మాట్లాడుతున్న సీతారాం

ఎటపాక, జూలై 3: పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కన్నా, నిర్వాసితులకు మొదటి ప్రాధాన్యం ఇచ్చి నష్టపరిహారం, పునరావాసం కల్పించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు మంతెన సీతారాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎటపాకలో సొందే రామారావు అధ్యక్షతన బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడారు. సీఎం చంద్రబాబు పోలవరం నిర్మాణం, స్థితిగతులపై సమీక్షలు చేస్తున్నారే తప్పా నిర్వాసితుల ఊసే ఎత్తకపోవడం బాధాకరమన్నారు. జూలై, ఆగస్టు నెలల్లో వచ్చే వర్షాలతో శబరిపోటు పెరిగి, నాలుగు విలీన మండలాలతో పాటు పక్కనే ఉన్న భద్రాచలం వరకు ముంపు ఉంటుందని చెప్పారు. వరద తీవ్రత పెరిగితే ఏజెన్సీలో 300 గ్రామాలు ముంపులో చిక్కుకుంటాయని అన్నారు. ప్రభుత్వం గోదావరి వరద ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. పోలవరం ప్రాజెక్టు పరిధిలో ఉన్న పది మండలాల్లో నిర్వాసితుల ప్రస్తుత పరిస్థితులపై ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గత వైసీపీ ప్రభుత్వం నిర్వాసితులను గాలికి వదిలేసిందని, ఈ ప్రభుత్వం శ్రద్ధ తీసుకోవాలని కోరారు. పునరావాసం కోసం నిర్మించిన ఇళ్లల్లోకి నిర్వాసితులను తరలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి ఐవీ, మండల కమిటీ సభ్యులు కాకా అర్జున్, పులుసు బాలకృష్ణ, సోయం వీరమ్మ, రత్తమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలి

అధికారులను ఆదేశించిన కలెక్టర్ దినేష్‌కుమార్



సమస్యలు వింటున్న కలెక్టర్ దినేష్‌కుమార్

చింతూరు, జూలై 3: వరదల సీజన్ సమీపిస్తున్న నేపథ్యంలో విలీన మండలాల్లోని ప్రతి అధికారి అప్రమత్తంగా ఉండాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ అన్నారు. చింతూరు ఐటీడీఏలో నిర్వహించిన సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో బుధవారం ఆయన పాల్గొన్నారు. విలీన మండలాలకు చెందిన పలువురు తమ సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి పత్రాలు అందజేశారు. అనంతరం వరద పరిస్థితులపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ముందుగానే సురక్షిత ప్రాంతాలలో బఫర్ స్టాక్ ఉంచాలన్నారు. సురక్షిత ప్రాంతాలను నిర్ణయించుకొని ఆయా ప్రాంతాలలో తాగునీరు, వసతి ఏర్పాట్లను ముందుగానే చేయాలన్నారు. లాంచీలు, మరబోట్లు అవసరాన్ని ముందుగానే గుర్తించి తనకు నివేదిక ఇవ్వాల్సిందిగా కలెక్టర్ ఆదేశించారు. ఎప్పటికప్పుడు పారిశుధ్య మెరుగునకు చర్యలు తీసుకోవాలని కోరారు. వైద్య సిబ్బంది మందులను నిల్వ ఉంచుకోవాలన్నారు. వరద తగ్గాక తీసుకోవాల్సిన చర్యలలో భాగంగా అవసరమైన జేసీబీలు, ట్రాక్టర్ల వివరాలను తనకు నివేదిక ద్వారా అందించాలని సూచించారు. విద్యుత్ శాఖ నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. భద్రాచలంలో వరద ఉధృతిని అనుసరించి ప్రజలకు సమాచారం అందిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ, సబ్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్, చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య, ఓఎస్‌డీ మహేశ్వరరెడ్డి, డీఎఫ్‌వో భవిత పాల్గొన్నారు.

సీఈని కలిసిన యూనియన్ నాయకులు

మోతుగూడెం, జూలై3: సీలేరు కాంప్లెక్స్ సీఈగా బాధ్యతలు స్వీకరించిన జీఎం వాసుదేవరావును బుధవారం 327 యూనియన్ రీజనల్ సెక్రటరీ పి.ఆనంద్‌బాబు ఆధ్వర్యంలో సభ్యులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పెండింగ్‌లో ఉన్న కార్మికుల సమస్యలు సీఈ దృష్టికి తీసుకెళ్లారు. సీఈ సానుకూలంగా స్పందించి మళ్లీ మరోసారి చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. రీజనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ రమణ, ట్రెజరర్ జి.శ్రీను, బ్రాంచ్ ప్రెసిడెంట్ పి.శ్రీను, బ్రాంచ్ సెక్రటరీ టి.దుర్గాప్రసాద్, శర్మ, నరసింహమూర్తి, టి.శైలజ, దుర్గాదేవి, సుజాత, వరలక్ష్మి, ధనలక్ష్మి, సునీత, సులక్షణ, చిన్నమ్మడు తదితరులు ఆయనను కలిశారు.

సమస్యలపై తక్షణం స్పందించిన ఎమ్మెల్యే శిరీష

అడ్డతీగల, జూలై3: అడ్డతీగలలో రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు స్థానిక సెయింట్ మేరీస్ పాఠశాల రహదారి ఛిద్రం అవ్వడంతో పాఠశాలకు వచ్చే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తల్లిదండ్రులు ఎమ్మెల్యే శిరీషాదేవి దృష్టికి తీసుకువెళ్లడంతో తక్షణం స్పందించిన ఎమ్మెల్యే వెంటనే రోడ్డును శుభ్రం చేయించి విద్యార్థుల ఇబ్బందులు తొలగించారు. అలాగే డ్రైనేజీ నుంచి దుర్గంధం వస్తుందని చెప్పడంతో ఆ సమస్యను కూడా గంట వ్యవధిలో పరిష్కరించారు.

ఘనంగా నరసింహస్వామి శాంతి కల్యాణం

అంతర్వేది, జూలై 3: అంతర్వేదిశ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బహుళ ద్వాదశిని పురస్కరించుకుని బుధవారం స్వామివారి-అమ్మవార్ల శాంతి కల్యాణం వైభవంగా జరిగింది. అర్చకులు స్వామివారి-అమ్మవార్లను పురాతన కల్యాణ మండపం వద్ద ప్రత్యేక సింహాసనంపై ఆశీనులుచేసి అలంకరించారు. అనంతరం అర్చకులు కల్యాణతంతు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు శాంతికల్యాణంలో పాల్గొన్నారు. ప్రధానార్చకులు పి.శ్రీనివాస కిరణ్, వెంకటశ్రీనివాస్, స్థానాచార్యులు రంగాచార్యులు పాల్గొన్నారు.

● అప్పనపల్లి బాలబాలాజీ స్వామి సన్నిధిలో చాగంటి కోటేశ్వరరావు ప్రవచనం
● అధికసంఖ్యలో హాజరైన భక్తులు

ప్రతీ ఒక్కరూ పుణ్య మార్గంలో నడవాలి


ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తున్న చాగంటి కోటేశ్వరరావు

మామిడికుదురు, జూలై 3: అప్పనపల్లి బాలబాలాజీ సన్నిధిలో బుధవారం రాత్రి బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు చేసిన శ్రీవేంకటేశ్వర వైభవం ప్రవచనం ఆకట్టుకుంది. ఈప్రవచనంలో ఆయన మాట్లాడుతూ కలియుగంలో ప్రజల బాధలను రూపు మాపడానికి మహావిష్ణువు శ్రీవేంకటేశ్వరస్వామిగా అవతరించారని పేర్కొన్నారు. ధర్మాన్ని రక్షిస్తే అది మిమ్మల్ని రక్షిస్తుందన్నారు. మానవులు ధర్మం వీడి సంపాదిస్తున్నారని, అటువంటి సంపాదన నిలవదన్నారు. ప్రతీ ఒక్కరూ పుణ్య మార్గంలో నడవాలని, పాప మార్గాన్ని విడనాడాలన్నారు. అప్పనపల్లి బాలబాలాజీ ఆలయం విశిష్టతను, ఆలయ స్థాపన ప్రాముఖ్యత గురించి భక్తులకు వివరించారు. ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా నిత్యాన్నదానాన్ని ప్రారంభించిన దేవస్థానం అప్పనపల్లి అని అన్నారు. భక్తి మార్గంలో నడిస్తే అందరికి మంచి జరుగుతుందన్నారు. వేంకటేశ్వరస్వామి లీలలను ప్రవచనం రూపంలో భక్తుల కళ్లకు కట్టినట్టు చెప్పారు. ప్రవచనాన్ని వీక్షించేందుకు భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ సహాయ కమిషనర్ జి.మాధవి ఏర్పాట్లు చేశారు.

సీఎం రంగసామిపై కేంద్ర మంత్రికి ఫిర్యాదు


కేంద్ర మంత్రిని కలిసిన పుదుచ్చేరి బీజేపీ ఎమ్మెల్యేల బృందం

యానాం, జూలై 3: పుదుచ్చేరిలో ఎన్డీఏ, ఎన్ఆర్ కాంగ్రెస్ కూటమి ప్రభుత్వంలో ఉన్నప్పటికీ ఎమ్మెల్యేలకు సముచిత స్థానం కల్పించడం లేదని పలువురు బీజేపీ, స్వతంత్ర ఎమ్మెల్యే బృందం కేంద్రానికి ఫిర్యాదు చేసింది. పుదుచ్చేరి బీజేపీకి చెందిన రాజ్యసభ సభ్యుడు సెల్వగణపతి ఆధ్వర్యంలో పుదుచ్చేరి ఎమ్మెల్యేల బృందం కేంద్ర వ్యవహారాల మంత్రి అర్జున్ రాంమేఘ్వాల్, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డాలను కలిసి ఆవేదన వ్యక్తంచేశారు. పుదుచ్చేరిలో కూటమి ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు అయినప్పటికి ఇంతవరకు కూటమిలో ఉన్న ఎమ్మెల్యేల నియోజకవర్గాల అభివృద్ధికి సహకరించకుండా సీఎం ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి తన వైఖరి మార్చుకోకపోతే ప్రభుత్వంలో కొనసాగే అవకాశం ఉండదని ముగ్గురు బీజేపీ ఎమ్మెల్యేలు, ముగ్గురు స్వతంత్ర ఎమ్మెల్యేలు, మరో ఇద్దరు బీజేపీ నామినేటెడ్ ఎమ్మెల్యేలు కేంద్ర మంత్రులకు వివరించారు. దీనిపై సాధ్యమైనంత త్వరగా అధిష్ఠానం నిర్ణయం తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈబృందంలో యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఉన్నారు.

వన మహోత్సవ వారోత్సవాల ర్యాలీ


ఆర్డీవో కార్యాలయం వద్ద మానవహారంగా ఏర్పడ్డ ఆదిత్య విద్యార్థులు

అమలాపురం రూరల్, జూలై 3: వన మహోత్సవ వారోత్సవాల్లో భాగంగా కామనగరువు ఆదిత్య స్కూలు ప్రిన్సిపాల్ రాంప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థులు బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. పాఠశాలకు చెందిన 8,9తరగతుల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆదిత్యపాఠశాలనుంచి ర్యాలీగా ఎర్రవంతెన వద్దకు చేరుకున్నారు. పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను వివరిస్తూ ప్లకార్డులు చేతబూని నినాదాలు చేశారు. ఆర్డీవో కార్యాలయం వద్ద వనమహోత్సవ విశిష్టతను వివరిస్తూ మానవహారంగా ఏర్పడ్డారు. అక్కడి నుంచి తాలూకా సీఐ కార్యాలయం వద్దకు చేరుకుని ప్రభుత్వ కార్యాలయాల ఎదుటమొక్కలు నాటారు. తాలూకా సీఐ పి.వీరబాబు, ఎస్ఐ వై.శేఖర్‌బాబు, సీడీపీవో విజయకుమారి, మహిళా శక్తి సంఘాల సభ్యులతో కలిసి నల్లవంతెన వరకు ర్యాలీ నిర్వహించారు. దారి పొడవునా మొక్కలు నాటారు. విద్యార్థులను ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, డైరెక్టర్ ఎస్.శృతిరెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పీవీఎస్ చలపతిరావు, ప్రిన్సిపాల్ రాంప్రసాద్, వైస్‌ప్రిన్సిపాల్ లక్ష్మీసుధ అభినందించారు.

ఎమ్మెల్యే వేగుళ్లకు కుల సంఘాలు అభినందనలు


ఎమ్మెల్యే వేగుళ్లను అభినందించిన కులసంఘాలు

మండపేట, జూలై3: మండపేట పట్టణ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వర రావును మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. వేగుళ్లను సంఘం ఆధ్వర్యంలో వేదమంత్రాల నడుమ సత్కరించారు. వేగుళ్లకు నోట్ పుస్తకాలు అందజేశారు. తన విజయ కోసం పనిచేసిన బ్రాహ్మణ సంఘీయులను వేగుళ్ల అభినందించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘ నాయకులు అవసరాల వీర్రాజు, దంటూ సూర్యనారాయణ, గరిమెళ్ల గోపాలకృష్ణ, విద్యాసాగర్, సోమనాధం, పెదపర్తి స్వామి, బ్రాహ్మజీ, రంగనాథచార్యులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును బుధవారం పట్టణ కాపు అభ్యుదయ సంఘం అధ్యక్షుడు జిన్నూరి సాయిబాబా సారధ్యంలో టీడీపీ కార్యాలయంలో కలిసి అభినందనలు తెలిపారు. వేగుళ్లను పూలమాలలు శాలువాలతో సత్కరించారు. నియోజకవర్గానికి చెందిన శాలివాహన సంఘ నాయకులు వేగుళ్లను కలిసి సత్కరించారు. కమ్యూనిటీ హాల్‌ను నిర్మించాలని కోరగా వేగుళ్ల సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

లేబర్ కోడ్‌లను వెంటనే రద్దుచేయాలి

అమలాపురం టౌన్, జూలై 3: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరామ్ కోరారు. ప్రైవేటీకరణ విధానాలకు స్వస్తి పలకాలన్నారు. భవన నిర్మాణ కార్మిక సంక్షేమ పథకాలను తిరిగి ప్రారంభించడంతో పాటు బకాయి పడ్డ క్లయిమ్‌లకు తక్షణం పరిహారం చెల్లించాలని డిమాండు చేశారు. సీఐటీయూ జిల్లా కార్యవర్గ సమావేశం అమలాపురంలోని సంఘ కార్యాలయం వద్ద గుదే దుర్గాప్రసాద్ అధ్యక్షతన బుధవారం జరిగింది. బలరామ్‌తో పాటు కోశాధికారి కె.కృష్ణవేణి మాట్లాడుతూ లేబర్‌కోడ్‌లు అమలులోకి వస్తే సమ్మెలు చేయడం సాధ్యం కాదన్నారు. జీతాలు పెంచకపోగా నిర్బంధాన్ని తీవ్రతరం చేస్తారని విమర్శించారు. కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఈనెల10న దేశవ్యాప్తంగా చేపట్టిన డిమాండ్స్ డేను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడపడంతో పాటు ప్లాంట్ రక్షణకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు.

కలెక్టర్ హిమాన్షుశుక్లాను కలిసిన లీలాకృష్ణ

కపిలేశ్వరపురం, జూలై 3: జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాను జనసేన పార్టీ మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ వేగుళ్ళ లీలాకృష్ణ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. లీలాకృష్ణ కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.

రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ

రావులపాలెం, జూలై 3: రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్, మ్యూజిక్ ఫామ్‌లో రావులపాలెం మదర్‌థెరిస్సా స్పోర్ట్స్ అండ్ డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు బంగారు పతకాలు సాధించినట్టు మాస్టర్ వెంకటలక్ష్మి, కోచ్ లక్ష్మి, సందీప్‌కిరణ్ తెలిపారు. బాలుర విభాగంలో కీర్తి జశ్వంత్, కర్రి లీలాశ్రీప్రణీత్‌రెడ్డి, మేడపాటి హర్షవర్ధన్‌రెడ్డి, నందికోళ్ళ ఆశిష్, బాలికల విభాగంలో పెమ్మనబోయిన సుష్మంజలి గోల్డ్‌మెడల్ సాధించారు. వారిని సీఆర్సీ కార్యదర్శి కర్రి అశోక్‌రెడ్డి, స్పోర్ట్స్ డైరెక్టర్ నల్లమల్లి వీరరాఘవరెడ్డి, గ్రాండ్ మాస్టర్ టి.అబ్బులు, మేడపాటి రామారెడ్డి అభినందించారు.

రాష్ట్రస్థాయి చెస్ టోర్నమెంట్ చాంపియన్‌గా సాత్విక్

అమలాపురంటౌన్, జూలై3: రాజమహేంద్రవరం కాల్ ఫ్యూజన్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి చెస్ టోర్నమెంట్‌లో అమలాపురం విక్టరీ అకాడమీ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి తాడి వెంకటసురేష్‌కుమార్ తెలిపారు. రాష్ట్ర చాంపియన్‌గా అకాడమీకి చెందిన ద్రాక్షారపు సాత్విక్ ఏడు రౌండ్లకు ఏడు గెలిచి ప్రథమ స్థానంతోరూ.2,500 బహుమతి గెలుపొందాడు. అండర్-15 కేటగిరీలో అకాడమీకి చెందిన కేశనకుర్తి రాజేష్ ప్రథమ స్థానంతో రూ.2,500, బండారు నానిబాబు ద్వితీయస్థానంతో రూ.వెయ్యి దక్కించుకున్నారు. విజేతలకు ప్రియాచౌదరి, రాష్ట్ర చెస్‌అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి వై.కల్యాణ్ షీల్డులు, బహుమతులు అందజేశారు.

విద్యార్థుల పట్ల స్నేహపూర్వకంగా మెలగాలి

పి.గన్నవరం, జూలై 3: విద్యార్థుల పట్ల అధికారులు, ఉపాధ్యాయులు స్నేహపూర్వకంగా మెలగాలని ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరావు అన్నారు. నాగుల్లంకలో జరిగిన ఇంగ్లీషు ఉపాధ్యాయుడు పీఆర్‌కే సాయిబాబు ఉద్యోగ విరమణ కార్యక్రమానికి హెచ్ఎం అనిల్‌కుమార్ అధ్యక్షత వహించగా ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ వృత్తే కాదని సమాజంలో అన్ని వృత్తులు గొప్పవేనన్నారు. సాయిబాబాను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో కె.హెలీనా, సర్పంచ్ యల్లమిల్లి కృష్ణవేణి, యూటీఎఫ్ నాయకులు సీహెచ్ పేర్రాజు, జి.ఆనందరావు, కె.సురేష్‌కుమార్, డి.రామకృష్ణ, వివిధ పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే స్వచ్ఛభారత్

ఆలమూరు, జూలై 3: ఇల్లు, ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే గ్రామం శుభ్రంగా ఉంటుందని, తద్వారా దేశం స్వచ్ఛ భారత్‌గా మారుతుందని ఓఎన్జీసీ స్వచ్ఛ పక్వాడా విభాగం మేనేజరు పి.జగన్నాథరావు, పినపళ్ల సర్పంచ్ సంగిత సుభాష్ అన్నారు. పినపళ్లలో బుధవారం స్వచ్ఛ భారత్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామ పరిశుభ్రతకు డస్ట్‌బిన్లతో పాటు పారిశుధ్య కార్మికులకు కిట్లు అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పెద్దిరెడ్డి పట్టాభి, ఉప సర్పంచ్ యనమదల శ్రీనివాస్, ఓఎన్జీసీ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం

అయినవిల్లి, జూలై 3: అయినవిల్లి శ్రీసిద్ధివినాయక స్వామి అన్నదాన ట్రస్టుకు హైదరాబాద్ యూసఫ్‌గూడకు చెందిన పేరిచర్ల సుబ్రహ్మణ్యవర్మ కుటుంబం బుధవారం రూ.1,00,016 విరాళం అందించింది. తొలుత వారు విఘ్నేశ్వరస్వామిని దర్శించుకున్నారు. దాతకు అర్చకులు వేదాశీర్వచనం అందజేసి శేషవస్త్రంతో సత్కరించారు. ఈవో ముదునూరి సత్యనారాయణరాజు దాతను అభినందించి స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన ఎమ్మెల్యే బండారు



కొత్తపేట, జూలై 3: కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు బుధవారం ఉండవల్లిలో మంత్రి నారా లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. నియోజకవర్గంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తానని లోకేశ్ హామీ ఇచ్చారు. సత్యానందరావు వెంట ఆయన తనయుడు సంజీవ్ ఉన్నారు.

అమ్మవార్ల ఆలయాల్లో చోరీ

అల్లవరం, జూలై 3: అల్లవరం బీసీ ఏరియాలోని కనక దుర్గమ్మ ఆలయంలోని హుండీని బుధవారం తెల్లవారుజామున పగులకొట్టి రూ.15వేలు దోచుకుపోయారు. దొంగలు హుండీని పగలకొట్టడానికి తెచ్చుకున్న సుత్తి, ఐరన్ రాడ్డు మరిచిపోయి వెళ్లారని పోలీసులకు ఆలయ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. ఐదు రోజుల క్రితం మొల్లేటిగరువులో కనకదుర్గమ్మ ఆలయం వద్ద సీసీ కెమెరా వైర్లను కత్తిరించి హుండీలో రూ.30వేలు అపహరించారు. గ్రామస్తులు ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

టూవీలర్ సృష్టికర్త గాట్లీబ్ డైమ్లర్ మహనీయుడు

పి.గన్నవరం, జూలై3: టూవీలర్ సృష్టికర్త గాట్లీబ్ డైమ్లర్ మహనీయుడని, ఎంతోమందికి ఉపాధి కల్పించిన ఘనత దక్కుతుందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. ప్రపంచ టూవీలర్ మెకానిక్స్ డే సందర్భంగా పోతవరంలో శ్రీసూర్యచంద్ర మోటార్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆయన మాట్లాడారు. తొలుత యూనియన్ సభ్యులు పి.గన్నవరం త్రీరోడ్ సెంటర్ నుంచి పోతవరం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కేక్ కట్‌చేసి ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సర్పంచ్ బొండాడ నాగమణి, నాయకులు శిరిగినీడి వెంకటేశ్వరావు, వాసంశెట్టి కుమార్, సాధనాల శ్రీవెంకట సత్యనారాయణ, తాటికాయల శ్రీనివాసరావు, కొమ్మూరి మల్లిబాబు, ఆదిమూలం సూర్యనారాయణ, యూనియన్ అధ్యక్షులు గుగాల గంగాధర్, సభ్యులు చిటికినీడి నాగేశ్వరావు, కొక్కిరిగడ్డ సత్యనారాయణ, కొట్టు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మెకానిక్‌లను ప్రభుత్వం ఆదుకోవాలి

అంబాజీపేట,జూలై3: మోటార్‌బైక్ మెకానిక్‌లనుప్రభుత్వం ఆదుకోవాలని మెకానిక్స్ కోరారు. స్థానిక సెంటర్‌లో శ్రీలక్ష్మీ గణపతి మెకానిక్‌యూనియన్ ఆధ్వర్యంలో జాతీయ మోటారు మెకానిక్ దినోత్సవాన్ని నిర్వహించారు. కేక్‌కట్ చేశారు.

మోటారు మెకానిక్ వర్కర్స్ ర్యాలీ

రామచంద్రపురం, జూలై 3: బుధవారం ద్రాక్షారామ, రామచంద్రపురం మెకానిక్ వర్కర్స్ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. రాజగోపాల్ సెంటర్‌లో కేకు కట్ చేశారు. మెకానిక్ వర్కర్స్‌కు కార్మికశాఖ ద్వారా సంక్షేమ పథకాలు అందించాలని యూనియన్ నాయకులు కోరారు. మంత్రిని కలిసి విన్నవిస్తామన్నారు. మెకానిక్ వర్కర్స్ యూనియన్ నాయకులు జమ్మి నాగేశ్వరరావు, యాండ్ర బుల్లబ్బులు, కొట్టువాడ హరిబాబు, హరి, టీడీపీ నాయకుడు బాబూరావుపాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్‌ను కలిసిన జనసేన ఇన్‌చార్జి



ద్రాక్షారామ, జూలై 3: డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను రామచంద్రపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ మంగళవారం రాత్రి పిఠాపురంలో మర్యాదపూర్వకంగా కలిశారు. వారాహి దీక్షలో ఉన్న పవన్‌కు వారాహి అమ్మవారి విగ్రహాన్ని అందచేశారు. పలువురు జనసేన నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుచేయాలి

అమలాపురం టౌన్, జూలై 3: పేద విద్యార్థులు చదువుకునేందుకు వీలుగా అమలాపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని కోరుతూ పీడీఎస్‌యూ, కామన్‌మెన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావుకు వినతిపత్రం అందజేశారు. ఎస్‌కేబీఆర్ కళాశాల ప్రైవేటు కళాశాలగా మారిపోవడం శాపంగా మారిందన్నారు. వినతిపత్రం స్వీకరించిన వెంటనే ఆర్జేడీ శోభారాణితో ఎమ్మెల్యే ఆనందరావు ఫోన్‌లో మాట్లాడారు. డిగ్రీ కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు.పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు, కామన్‌మెన్ ఫౌండేషన్ అధ్యక్షుడు కాశి చంద్రమౌళి పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంకు మేనేజర్‌గా శ్రీరామమూర్తి

అంబాజీపేట, జూలై 3: స్థానిక యూనియన్ బ్యాంకు మేనేజర్‌గా ఎం.వెంకటశ్రీరామమూర్తి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అయినవిల్లి మండలం తొత్తరమూడి బ్రాంచ్ నుంచి ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన మేనేజర్ ఎంవీరమణ ఉప్పలగుప్తం బ్రాంచ్‌కు బదిలీ అయ్యారు.

అసాంఘిక కార్యకలాపాలకు లాడ్జిలు అద్దెకు ఇవ్వొద్దు

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 3: అసాంఘిక కార్యకలాపాలకు లాడ్జిల్లో గదులు అద్దెకు ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ బి.రామకృష్ణ హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని 14 లాడ్జిలను డీఎస్పీ ఆదేశాలతో సీఐ దొరరాజు ఆధ్వర్యంలో ఎస్ఐలు కె.సురేష్‌బాబు, ఎస్‌కే జానీ, జి.సురేంద్ర, హరికోటి శాస్త్రి, సిబ్బంది తనిఖీ చేశారు. యువకులను అదుపులోకి తీసకుని, తల్లిదండ్రులను పిలిచి కౌన్సిలింగ్ ఇచ్చారు. స్టేషన్‌లో లాడ్జి యజమానులతో సమావేశం నిర్వహించి హెచ్చరికలు జారీ చేశారు.

డీజీపీని కలిసిన మంత్రి సుభాష్



ద్రాక్షారామ, జూలై 3: డీజీపీ ద్వారకా తిరుమల రావును కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ బుధవారం డీజీపీకార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. మంత్రి సుభాష్ వెంట టీడీపీ నాయకులు గంధం పళ్లం రాజు తదితరులు ఉన్నారు.

గుర్తింపుకార్డులతో మాజీ సైనికులకు ప్రయోజనాలు

అమలాపురం టౌన్, జూలై 3: మాజీ సైనికుడు వెబ్ రిజిస్ట్రేషన్ చేయించుకోవడం ద్వారా పొందిన గుర్తింపు కార్డులతో బహుళ ప్రయోజనాలు పొందవచ్చని జిల్లా సైనిక సంక్షేమాధికారి ఎం.కృష్ణారావు పేర్కొన్నారు. బుధవారం అమలాపురంలో మాజీ సైనికులసంఘ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను కృష్ణారావు వివరించారు. ఆర్థిక సహాయం మొత్తాలను పెంచిన విధానాలను బ్రిగేడియర్ డైరెక్టర్ వి.వెంకటరెడ్డి వివరించారు. మాజీ సైనికులకు గుర్తింపు కార్డులు అందజేశారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు దొంగ నరసింహమూర్తి, కార్యదర్శి రాంబాబు, కోశాధికారి కంకటాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పిచ్చికుక్క స్వైరవిహారం

అమలాపురం టౌన్, జూలై 3: బండారులంకలో బుధవారం పిచ్చి కుక్క స్వైరవిహారంచేసి పలువురిని తీవ్రంగా గాయపరిచింది. గ్రామానికి చెందిన డి.నాగేశ్వరరావు, ఎ.నాగరాజు, ఎ.లక్ష్మి, బి.జయనాగశంకర్, కె.బాలకృష్ణ, డి.సత్యనారాయణ గాయపడగా వారికి స్థానిక పీహెచ్‌సీలో వైద్య సేవలందించినట్టు వైద్యాధికారి ఎం.వాసునాయక్ తెలిపారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

కపిలేశ్వరపురం, జూలై 3: కాలేరు జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని గ్రామసర్పంచ్ దాయం కావేరి రుచి చూశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం డంపింగ్ యార్డ్‌ను పరిశీలించారు. గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టి ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్లతో చెత్తను తొలగించారు. గ్రామసభ నిర్వహించి అభివృద్ధి పనులపై చర్చించి తీర్మానం చేశారు.

మూగవారి గోడును అర్థం చేసుకున్న కూటమి ప్రభుత్వం

అమలాపురం టౌన్, జూలై 3: చెవిటి, మూగవారి గోడును అర్థం చేసుకుని పెన్షన్‌ను రూ.3వేలు నుంచి రూ.6వేలకు పెంచిన కూటమి నేతలకు అమలాపురం గడియార స్తంభం సెంటర్లో బుధవారం అభినందన సభ నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లతో పాటు దివ్యాంగుల సహకార సంస్థ మాజీ చైర్మన్ కోటేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. సహకరించిన కూటమి శ్రేణులకు ధన్యవాదాలు తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన మూగవారు ఆనందం వ్యక్తం చేస్తూ కేక్ కట్ చేశారు. మోటపల్లి రవితేజ, నాగేశ్వరరావు, మణి పాల్గొన్నారు.

తాగునీటి కోసం మహిళల నిరసన

అమలాపురం రూరల్, జూలై 3: భట్నవిల్లి శివారు శెట్టిపేట కాలనీకి తాగునీరు అందించాలని కోరుతూ పంచాయతీ కార్యాలయం ఎదుట మహిళలు నిరసన వ్యక్తం చేశారు. కాలనీవాసులు పంచాయతీ కార్యాలయానికి చేరుకుని ఏడాది కాలంగా సక్రమంగా తాగునీరు అందకపడుతున్న ఇబ్బందులను పంచాయతీ కార్యదర్శి కట్టా సత్యబాబ్‌కు వివరించారు. ఇంటింటికీ కుళాయిలు వేసిన ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు తాగునీరు అందించడంలో విఫలమయ్యారని ఆరోపించారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ చినబాబు పంచాయతీ కార్యాలయానికి వచ్చి సమాధానం చెప్పాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఒక దశలో సిబ్బందితో వాగ్వివాదం చోటుచేసుకుంది. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తిరుకోటి సతీష్ హామీ ఇవ్వడంతో మహిళలు ఆందోళన విరమించారు.

ఎస్వీ రంగారావు జయంతి

అమలాపురం టౌన్, జూలై 3: నవరస నటనా సార్వభౌమ ఎస్వీ రంగారావు జయంతిని జిల్లా చేతివృత్తుల సంక్షేమ సేవా సంఘం కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. జిల్లా శాఖ అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో పలువురు ఎస్వీఆర్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గున్నేపల్లి భీమశంకరం, ముస్కూరి ఏసుబాబు, కముజు సుందరరావు, పితాని బేబీరావు, కుసుమే నరసింహరాజు, వాసంశెట్టి గణేష్, రొక్కాల వెంకటరమణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రావులపాలెం, జూలై 3: రావులపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో గురువారం సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ ఎం.రవికుమార్ తెలిపారు. రావులపాడు, ఊబలంక, రావులపాలెం పరిధిలోని ప్రభుత్వ కళాశాలల ప్రాంతం, అంకాలమ్మ గుడి ప్రాంతంలో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: --
వెంకటరమణ	: కల్కి 2898 ఏడీ
శ్రీలలిత	: మహారాజ
శేఖర్ స్క్రీన్-1	: కల్కి 2898 ఏడీ
శేఖర్ స్క్రీన్-2	: కల్కి 2898 ఏడీ
రమా	: ప్రభుత్వ జూనియర్ కళాశాల
గణపతి	: హరోం హర
వెంకటపద్మావతిస్క్రీన్-1	: కల్కి 2898
వెంకటపద్మావతి స్క్రీన్-2	: కల్కి 2898 ఏడీ

ప్రధాని పిలుపుతో జొన్నాడలో మొక్కలు నాటారు

ఆలమూరు, జూలై 3: మాతృమూర్తి పేరుమీదుగా ప్రతిఒక్కరూ ఒక మొక్క నాటాలన్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపుమేరకు జొన్నాడలో బుధవారం మొక్కలు నాటారు. అవి చెట్లగా మారే వరకు సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు. నాయకులు తాడి శ్రీనివాసరెడ్డి, గొడవర్తి బాబీ, అయినవిల్లి సత్తిబాబు, గొలుగూరి ఈశ్వరరెడ్డి, మేడపాటి వెంకటకృష్ణారెడ్డి, కోమలి శ్రీనివాస్, వీరి కృష్ణ, రేలంగి కొండ, వీరి సందీప్, పోలినాటి కుమార్‌రాజా తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఎం గోపాలరావు సేవలు అభినందనీయం



కొత్తపేట,జూలై3: కొత్తపేట ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎంగా పనిచేసిన అల్లూరి గోపాలరావు సేవలు అభినందనీయమని కొత్తపేట సర్పంచ్ బూసి జయలక్ష్మిభాస్కరరావు అన్నారు. బుధవారం ఉద్యోగ విరమణ సందర్భంగా గోపాలరావు దంపతులను సత్కరించారు. రంకిరెడ్డి రామకృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు గోపాలరావు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నార్గన గంగాధర్, గొల్లపల్లి డేవిడ్‌రాజు, కంఠంశెట్టి శ్రీనివాస్, ముత్యాల వీరభద్రరావు, ముత్యాల బాబ్జీ, బీరా శ్రీనివాస్, ఎస్ఎల్ నరసింహ, ఎంఈవోలు ఎం.హరిప్రసాద్, కె.లీలావతి, హెచ్ఎంలు, యూటీఎఫ్, ఎస్టీయూ నాయకులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్ పెంపుపై దివ్యాంగుల కృతజ్ఞతలు

మామిడికుదురు, జూలై 3:దివ్యాంగులకు రూ.6వేలకు పింఛన్ పెంచడంపై సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు దివ్యాంగులు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక అంబేడ్కర్ సామాజిక భవనంలో బుధవారం మదర్‌థెరిస్సా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గుర్రం శ్రీనివాస్ అధ్యక్షతన సమావేశం జరిగింది. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి నూటుకుర్తి సత్యనారాయణ మాట్లాడారు. సమావేశంలో కేతా శ్రీను, కొమ్ముల కోటేశ్వరరావు, నయినాల రాంబాబు, గుబ్బల ఏడుకొండలు, కండిబోయిన బాబులు, కుడపూడి సాయిబాబు, పి.దుర్గావతి, మొల్లేటి దుర్గ, గెద్దాడ మహలక్ష్మి పాల్గొన్నారు.

ఆప్త బంధువులు ఎన్టీఆర్, చంద్రబాబు



రాజోలు, జూలై 3: వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఇచ్చిన పెన్షన్ల పెంపు హామీని అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదని టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి బోళ్ల వెంకటరమణ అన్నారు. పేదల పాలిట ఆప్త బంధువులు, టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్, సీఎం చంద్రబాబు అని అన్నారు. రాజోలులో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వృద్ధుల పెన్షన్ రూ.4వేలకు పెంచి గత మూడు నెలల పెంపు పెన్షన్ కూడా కలిపి రూ.7వేలు అందజేసిన చంద్రబాబు పేదల కుటుంబాలకు పెద్ద కొడుకు అని అన్నారు. దేశంలో తొలిసారిగా సామాజిక పెన్షన్ల పంపిణీ చేపట్టింది టీడీపీ ప్రభుత్వమేనని గుర్తుచేశారు. నాడు ఎన్టీఆర్ రూ.75తో పెన్షన్ పథకం చేపడితే నేడు చంద్రబాబు రూ.4వేలు పెన్షన్ అందిస్తున్నారని తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి

అయినవిల్లి, జూలై 3: బుడగ జంగాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. బుడగ జంగాల కుల ధ్రువీకరణ పత్రాల జారీలో సమస్యలను సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామన్నారు. తొత్తరమూడిలో బుధవారం బుడగ జంగాలు ఎమ్మెల్యే సత్యనారాయణను సత్కరించారు. మండలంలో తాగునీరు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు చిట్టూరి శ్రీనివాస్, నేదునూరి వీర్రాజు, వారా లక్ష్మీనరసింహరామ్, మద్దాల సుబ్బారావు తదితరులుపాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు రూ.10లక్షల పంపిణీ

ఉప్పలగుప్తం, జూలై 3: కృష్ణా జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎస్.యానానికి చెందిన పెసంగి కనకరాజు, రేవు భూషణం మృతి చెందిన సంగతి తెలిసిందే. బుధవారం వారి కుటుంబాలకు రూ.5లక్షల వంతున ప్రభుత్వ సహాయాన్ని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, ఆర్డీవో కేశవర్ధనరెడ్డి అందించారు. కార్యక్రమంలో తహసీల్దారు మల్లికార్జునరావు, మాజీ ఎంపీటీసీ ఉలిశెట్టి దొరబాబు, అయితాబత్తుల రాజశేఖర్, అయితాబత్తుల అజయ్‌సింగ్, రేవు తిరుపతిరావు, వీఆర్వో అవిడి రాము పాల్గొన్నారు.

సదరం సర్టిఫికెట్లకు దరఖాస్తు చేసుకోవాలి

అంబాజీపేట, జూలై 3: దివ్యాంగులకు పెన్షన్ మంజూరు, ఇతర సౌకర్యాలకు సదరం సర్టిఫికెట్లకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో సరోవర్ సూచించారు. స్లాట్లను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. జూలై, ఆగస్టు, సెప్టెంబరు నెలలకు సదరం సర్టిఫికెట్లు పొందేందుకు గురువారం నుంచి గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మంచినీటి ట్యాంకులను శుభ్రంగా ఉంచాలి

అంబాజీపేట, జూలై 3: గ్రామాల్లో మంచినీటి ట్యాంకులను శుభ్రంగా ఉంచే విధంగా పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డీఎల్పీవో పి.బొజ్జిరాజు సూచించారు. ఇరుసుమండ, పుల్లేటికుర్రు, ముక్కామల తదితర గ్రామాల్లోని వాటర్ ట్యాంకులను బుధవారం ఆయన పరిశీలించారు. ప్రజలకు రక్షిత తాగునీరు అందించి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విధులు పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి ఆర్.ఏడుకొండలు చంటి, సిబ్బంది పాల్గొన్నారు. గంగలకుర్రులో డయేరియాపై సీహెచ్‌వో బి.అప్పారావు, వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు.

ప్లాస్టిక్‌ను తరిమి కొడదాం

మలికిపురం, జూలై 3: ప్లాస్టిక్ భూతంతో మానవాళికి ముప్పు ఏర్పడుతుందని వక్తలు పేర్కొన్నారు. బుధవారం అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవాన్ని పురస్కరించుకుని జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ వినియోగం విపరీతంగా పెరిగి డంపింగ్ యార్డుల్లో కుప్పలు కుప్పలుగా దర్శనమిస్తున్నాయన్నారు. ప్రతీ ఒక్కరూ ప్లాస్టిక్‌ను నిషేధించాలన్నారు. కార్యక్రమంలో పీవీవీ వరప్రసాద్, జంపన బుజ్జిరాజు, మధురాజు, అటారం మాష్టారు తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ విద్యార్థుల ఉపకార వేతనాలకు దరఖాస్తులు

రాయవరం, జూలై 3: పేద బ్రాహ్మణుల పిల్లలకు ఉపకార వేతనాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు బ్రాహ్మణ సేవా ట్రస్టు చైర్మన్ దంతుర్తి సత్యప్రసాద్ బుధవారం తెలిపారు. వెదురుపాకలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ట్రస్టు ద్వారా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో బ్రాహ్మణ కులానికి చెందిన ఇంటర్, బీటెక్, డిగ్రీ విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేస్తామన్నారు. జూలై 15లోపు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 9849592523 నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

'పార్టీ నుంచి సస్పెండ్ చేస్తే నిరూపించాలి'

మామిడికుదురు, జూలై 3: టీడీపీ నుంచి తనను సస్పెండ్ చేస్తే నిరూపించాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా తెలుగు యువత మాజీ అధికార ప్రతినిధి మెండా వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. తనను పార్టీ నుంచి బహిష్కరించినట్టు మామిడికుదురు టీడీపీ గ్రామశాఖ సమావేశం తీర్మానించడాన్ని ఖండించారు. ఆధారాలు లేకుండా తనను పార్టీ నుంచి బహిష్కరించినట్టు పేర్కొనడం అర్థరహితమన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎవరు ఏ పార్టీకి పనిచేశారో కూటమి నాయకులు, కార్యకర్తలకు తెలుసని, ఎవరు కోవర్టులుగా పనిచేశారో ప్రజలకు తెలుసన్నారు.

150మందికి ఉచిత దంత పరీక్షలు

ద్రాక్షారామ, జూలై 3: ద్రాక్షారామలో భీమేశ్వర దంత వైద్యశాల 15వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ క్రాంతికుమార్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత దంతవైద్య శిబిరం నిర్వహించారు. 150మందికి దంత పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు, లిక్విడ్ పేస్టులు అందించారు. టీడీపీ నాయకులు జడ్పీ మాజీ వైస్ చైర్మన్ చింతపల్లి వీరభద్రరావు, సర్పంచ్‌లు కొత్తపల్లి అరుణ, పెమ్మిరెడ్డి నాగేశ్వరావు, పెమ్మిరెడ్డి మురళీ పాల్గొన్నారు.

డెంగ్యూ నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలి

ముమ్మిడివరం, జూలై 3: స్థానిక 4వ వార్డు పరిధిలోని జడ్పీ ఉన్నత పాఠశాల వెనుక ఉన్న డ్రైనేజీ నుంచి మురుగునీరు వెళ్లకపోవడంతో అధ్వానంగా మారింది. స్థానికుడు వెత్సా వెంకటసుబ్బారావు, వార్డు ఇన్‌చార్జి కాకి మాణిక్యం సమస్యను ఫ్లోర్ లీడర్ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై ఫ్లోర్ లీడర్ నగర పంచాయతీ ఏఈ, సిబ్బందితో అక్కడికి వెళ్లి పరిశీలించారు. డ్రైనేజీ సమస్యను గురువారంలోపు పరిష్కరిస్తామని ఏఈ స్థానికులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఆకొండి రామకృష్ణ, ర్యాలి ప్రసాద్ పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారం కేసులో నిందితుడు అరెస్టు

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై3: బాలికను ప్రేమ పేరుతో కిడ్నాప్ చేసి, ఆపై అత్యాచారం చేసిన యువకుడిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ కె.సురేష్‌బాబు తెలిపారు. గతనెల 24న ప్రేమించానని బాలికను గుత్తుల సురేష్ కిడ్నాప్ చేసి హైదరాబాద్‌కు తీసుకువెళ్లాడు. అక్కడ లాడ్జిలో అత్యాచారం చేశాడు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఈనెల29న బాలిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈనెల ఒకటో తేదీ రాత్రి నిందితుడు సురేష్‌ను అరెస్టుచేసి కోర్టులో హాజరుపరిచారు. కోర్టు అతడికి రిమాండుకు విధించింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్‌బాబు తెలిపారు.

ట్రాలీ లారీ ఢీ: ట్రాక్టర్ ట్రక్కు కిందపడి వ్యక్తి మృతి

యానాం, జూలై 3: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ట్రాక్టర్ డ్రైవర్ భోజనం చేసి రావడానికి తాళ్లరేవు మండలం గోవలంక సర్పంచ్ కోరుకొండ సింహాద్రమ్మ భర్త సూరిబాబు తన మోటార్‌సైకిల్‌ను ఇచ్చాడు. డ్రైవర్ భోజనానికి వెళ్లడంతో యానాం కనకాలపేట రోడ్డు అరటికాయలలంక సమీపంలో ట్రాక్టర్, ట్రక్కుకు మధ్య ఉన్న రాడ్‌పై సూరిబాబు కూర్చుని ఫోన్ మాట్లాడుతున్నాడు. యానాం నుంచి గోవలంక వైపు ఎక్స్‌కవేటర్‌ను ట్రాలీ తీసుకువెళ్తుంది. అయితే ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ట్రాలీ ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్, ట్రక్కు బోల్తా పడింది. ట్రక్కు చక్రం కింద పడి సూరిబాబు మృతి చెందాడు. సూరిబాబు పెద్దకుమారుడు గల్ఫ్‌లో ఉంటున్నాడు. సూరిబాబు మృతదేహాన్ని యానాం ప్రభుత్వ ఆసుపత్రిలో మార్చురీలో భద్రపరిచారు. విజయవాడకు చెందిన ట్రాలీ డ్రైవర్ దూపల్లి మోసేష్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ ఎస్ఐ శేరు నూకరాజు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

అంబాజీపేట, జూలై3: మాచవరం భారత్ గ్యాస్ కంపెనీ ఎదురుగా బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. అమలాపురం మండలం గున్నేపల్లి అగ్రహారానికి చెందిన మట్టా మణికంఠ (31) మోటారు సైకిల్‌పై పి.గన్నవరం నుంచి అంబాజీపేట వైపు వస్తున్నాడు. గ్యాస్ కంపెనీ వద్దకు వచ్చేసరికి మోటారుసైకిల్ అదుపుతప్పి బోల్తాకొట్టింది. అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసినట్టు ఎస్ఐ కె.చిరంజీవి తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

రావులపాలెం, జూలై3: స్థానిక సిద్ధార్థ పాఠశాల ఎదురుగా బొబ్బర్లంక-ముక్తేశ్వరం ప్రధాన పంటకాలువలో వెదురుబొంగులకు చిక్కుకున్న గుర్తుతెలియని 35-40ఏళ్ల పురుషుడి మృతదేహాన్నిగుర్తించారు.మృతదేహాన్ని కొత్తపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రాజేష్ తెలిపారు.